సాక్షి
కుమురం భీం
సోమవారం । 2 । అక్టోబర్ । 2023



గిరి'జనానికి' తీపికబురు

ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు.. 8లో▸



బడుల్లో నాసిరకం పనులు

వాంకిడి మండలంలో 'మన ఊరు -మన బడి'కి 23 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటివరకు కేవలం మూడు స్కూళ్లలో మాత్రమే పనులు పూర్తి చేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /25.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఒకటి రెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

అభివృద్ధిలో భేష్!



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

రామకృష్ణాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

- మంత్రుల నియోజకవర్గాలకు దీటుగా చెన్నూర్.. అంటూ కేటీఆర్ కితాబు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌పై మంత్రి ప్రశంసలు
- మందమర్రి, రామకృష్ణాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- చెన్నూర్ ఎత్తిపోతలు, కొత్తగా రెవెన్యూ డివిజన్, రెండు మండలాలపై త్వరలోనే శుభవార్త
- రామకృష్ణాపూర్ సభలో ప్రకటన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం పర్యటించారు. మంత్రి పర్యటన, సభ.. పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో జోష్ నింపింది. రెండు మున్సిపాలిటీల పరిధిలో రూ.312 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సింగరేణి స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నీతానై సక్సెస్ చేశారు. కేటీఆర్ కూడా సుమన్‌పై ప్రశంసలు కురిపించారు. ఎమ్మెల్యేగానే తన నియోజకవర్గాన్ని మంత్రుల నియోజకవర్గం తరహాలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. మంత్రి అయితే అద్భుతాలు చేస్తాడని పేర్కొన్నారు.



బహిరంగ సభ వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు

స్వాగతం పలికిన అధికారులు..

మంత్రి కేటీఆర్ మందమర్రిలో హెలీక్యాప్టర్ దిగగానే కలెక్టర్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ రాహుల్, సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ రామ్‌నాథ్ కేకన్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వాగతం పలికారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్‌కుమార్, నారదాసు లక్ష్మణ్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కార్మిక నాయకుడు కెంగర్ల మల్లయ్య, స్థానిక మున్సిపల్ పాలక వర్గాలు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు హాజయ్యారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

రామకృష్ణాపూర్ పట్టణంలో కేటీఆర్ వివిధ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. అభివృద్ధి పనులకు ప్రాంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలో రూ.500 కోట్లతో నిర్మించనున్న ఆయిల్ పాం ఫ్యాక్టరీకి ప్రభుత్వ విప్ సుమన్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ప్రాణహిత కాలనీలోని కేసీఆర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్, సమ్మక్క సారలమ్మ మహిళా భవన్, బతుకమ్మ గ్రౌండ్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, సెంట్రల్ లైటింగ్, అర్బన్ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులను ప్రారంభించారు. అనంతరం బొక్కలగుట్ట గాంధారివనంలో కేసీఆర్ అర్బన్‌పార్క్‌కు భూమిపూజ చేశారు. రూ.50 కోట్ల నిధులతో 250 ఎకరాల్లో పార్కు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. అక్కడి నుంచి క్యాతనపల్లి ఆర్‌వోబీ పనులు పరిశీలించి రామకృష్ణాపూర్ పట్టణానికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో రూ.15.16 కోట్లతో నిర్మించిన 286 డబుల్ బెడ్ రూం ఇళ్లను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అంగడిబజార్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను పరిశీలించారు.

హామీలతో ఆశలు

ఎమ్మెల్యే సుమన్ చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్, చెన్నూరు మండలంలోని గోదావరి తీర గ్రామాలతో కలిపి ఆస్నాద్, కోటపల్లి మండలం ప్రాణహిత తీర గ్రామాలను కలిపి పారుపల్లి మండలం ఏర్పాటు చేయాలని కోరడంతో మంత్రి తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సీఎం కేసీఆర్ నోటి నుంచి చెన్నూర్ ఎత్తిపోతలు ప్రారంభంపై శుభవార్త వింటారని చెప్పారు. ఈ ప్రాంతానికి సాగునీరు ఇచ్చి సస్యశ్యామలం చేస్తామన్నారు. రామకృష్ణాపూర్ పట్టణం, క్యాతనపల్లి ఆర్వోబీకి నిధుల విడుదలలో జాప్యంతో కాంట్రాక్టర్ పనిచేయడం లేదని, జాప్యం జరగకుండా చూడాలని విప్ కోరారు.

భారీ బందోబస్తు..

మంత్రి కేటీఆర్ పర్యటనలో అడుగడుగునా బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటించిన రోడ్డు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మరోవైపు శనివారం రాత్రి నుంచి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, వామపక్ష, విద్యార్థి సంఘాల నాయకుల్ని పోలీసు స్టేషన్లకు తరలించారు.

సుమన్‌కు ప్రమోషన్..

చెన్నూర్ నియోజకవర్గాన్ని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంత్రి కితాబు ఇచ్చారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధి పదేళ్లలో చేసి చూపించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపిస్తే సీఎం కేసీఆర్ ప్రమోషన్ ఇస్తారని కేటీఆర్ ప్రకటించారు. ఎమ్మెల్యేగానే ఇంత అభివృద్ధి చేశారని, ప్రమోషన్ వస్తే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని రామకృష్ణాపూర్ సభలో ప్రజలకు సూచించారు.

రెండు పిట్ట కథలు చెప్పిన కేటీఆర్..

బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా రెండు పిట్ట కథలు చెప్పారు. '17 ఏళ్ల బాలుడు చెడు వ్యసనాలకు బానిసై కన్న తండ్రి జేబులో డబ్బు దొంగిలించబోయాడు. అడ్డొచ్చిన అమ్మానాన్నలను చంపి జడ్జి ముందు నేను అనాథను అని శిక్ష తప్పించుకున్నాడు'.. 135 ఏళ్ల ముసలామెతో కాంగ్రెస్ పార్టీని పోలుస్తూ సూది పోతే పెద్ద మొక్కులు కోరడంపై వంటి కథలు వినిపించారు.

మిస్సింగ్ ఏరియాలకు త్వరలో పట్టాలు : విప్ సుమన్



మహిళకు పట్టా అందిస్తున్న కేటీఆర్

సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి తమ ప్రభుత్వ హయాంలో పట్టాలు పంపిణీ చేస్తున్నామని, అయితే రామకృష్ణాపూర్ పట్టణంలో మిస్సయిన కొన్ని ఏరియాలకు కూడా త్వరలో పంపిణీ చేస్తామని విప్ సుమన్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. క్యాతనపల్లి ఆర్‌వోబీ పనులకు సంబంధించి కొన్ని నిధులు పెండింగ్‌లో ఉండడంతో పూర్తికావడం లేదని, మంత్రి ఈ విషయంలో చొరవ తీసుకుని నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. రామకృష్ణాపూర్ ప్రాంతం ఒకప్పుడు గనులు, కార్మికులతో కళకళలాడేదని, గనులు మూతపడడంతో ఈ ప్రాంతం నుంచి ప్రజలు వలస వెళ్తున్నారని సుమన్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని కేటీఆర్‌కు విన్నవించారు.

టెంట్లు లేక ప్రజల ఇక్కట్లు...

మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన ప్రజలు కొంత అసహనానికి గురయ్యారు. సభా ప్రాంగణంలో వేలసంఖ్యలో కుర్చీలు వేసినప్పటికీ నీడ కోసం ఒక్కటెంట్ కూడా వేయలేదు. మిట్ట మధ్యాహ్నం సభ నిర్వహించడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతకు తట్టుకోలేక అసంతృప్తికి గురయ్యారు. కొంతమంది బాహాటంగానే విమర్శలు చేశారు. కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు సభ జరుగుతుండగానే బయటకు వెళ్లడం కనిపించింది. పరిస్థితి గమనించిన మంత్రి కేటీఆర్ 'ఎండలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టను' అంటూ 20 నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. అయితే అప్పటికే పలువురు మహిళలు వేడి, ఉక్కపోతతో సొమ్మసిల్లి పడిపోవడంతో వారిని అక్కడి నుంచి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు.

'గులాబీ' గాజులు చల్లి నిరసన

చెన్నూర్‌లో అభివృద్ధి జరగడం లేదని.. ఇది ఎమ్మెల్యే చేతగాని తనమే.. అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిళ్ల రాధిక ఆదేశాలతో మహిళా కార్యకర్తలు ఠాగూర్ స్టేడియంలో పలుచోట్ల గులాబీరంగు గాజులు చల్లి నిరసన తెలిపారు. అక్కడున్న పోలీసులు గుర్తించి విడిగా కవరులో తెచ్చిన వాటిని అడ్డుకున్నారు. అయితే కొందరు మహిళలు గాజులు చేతికి వేసుకుని వచ్చి సభలో పలు చోట్ల పారబోశారు.



సభలో వెదజల్లేందుకు తెచ్చిన గాజులు

మందమర్రిలో రోడ్‌షో...


మందమర్రిరూరల్: కేటీఆర్ పర్యటనలో భాగంగా మందమర్రిలో బాల్క సుమన్‌తో కలిసి రోడ్‌షో చేశారు. తర్వాత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల భవిష్యత్ కోసం కేసీఆర్ ఆలోచిస్తే కాంగ్రెస్, బీజేపీ సింగరేణికి నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ఆధ్వర్యంలో సింగరేణిలో అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. లాభాల బోనస్ 32 శాతం, దీపావళి బోనస్ రూ.వెయ్యి కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే మందమర్రి మున్సిపాలిటీలో ఎన్నికలు జరగడం లేదని విమర్శించారు.



మార్కెట్ సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

న్యూస్‌రీల్

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



దేవేందర్‌రెడ్డి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకుడు వీరమల్ల దేవేందర్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ కోమల్ లత పర్యవేక్షణలో గ్లోరియోసా సుపర్బా, సెలాస్ట్రస్ పానిక్యులేటస్ అనే రెండు ఔషధ మొక్కల పరిమాణాత్మక విశ్లేషణపై అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గ్లోకల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం, వైస్ ప్రిన్సిపాల్ రాజు దేవేందర్‌రెడ్డిని ఆదివారం అభినందించారు.

నిర్భయంగా ఓటు వేయాలి



వృద్ధులతో కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. 80 ఏళ్లు నిండిన ఓటర్లను ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 80 ఏళ్లు నిండిన వృద్ధులు 12 సార్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని అన్నారు. మద్యం, డబ్బు, కానుకలు వంటి ప్రలోభాలకు గురికాకుండా యువత నిష్పక్షపాతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేశ్, సిబ్బంది పోచయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు'



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ అన్నారు. పట్టణంలోని కాపు సంఘం భవనంలో ఆదివారం డీవైఎఫ్ఐ జిల్లా మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానిక యువతకు జిల్లాలో ఉన్న అవకాశాలను కూడా దక్కనీయడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగులు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయాలు, స్టడీసర్కిళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యాంరావు, కార్యదర్శి కార్తీక్, నాయకులు శ్రీనివాస్, సాయికృష్ణ, జాఫర్, టీకానంద్, రాజ్‌కుమార్, సతీశ్, పురుషోత్తం, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 'మిలాద్ ఉన్ నబీ' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్‌రూరల్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని జామియా మసీద్ నుంచి ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ప్రతిఒక్కరూ ప్రవక్త చూపిన సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, మైనార్టీ నాయకులు అసద్, రహమాన్, రియాజ్, హఫీజ్, తాజ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, నాయకులు రాజేందర్, శ్రీనివాస్, అశోక్, ఆనందరావు, కమలాకర్, రామచందర్, రవి పాల్గొన్నారు.

ఓపిక ఉన్నంత వరకు ప్రజాసేవ



బైక్ ర్యాలీలో కోనేరు కోనప్ప, పార్టీ నాయకులు

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: ఓపిక ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ మండలంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం నామానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిరంతరం ప్రజాసేవలోనే ఉంటూ ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. మీ అందరి ప్రేమతోనే తనకు ముఖ్యమంత్రి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారని, మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. సిర్పూర్ నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. అంతకుముందు వంజీరి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా చింతగూడ, కోయవాగు, అందవెల్లి, ఈజ్‌గాం, నామానగర్ వరకు సాగింది. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గజ్జి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఆసిఫాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని డీఎంహెచ్‌వో తుకారాం అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత పాటించడం ద్వారా రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో, సిబ్బంది

'డబుల్'.. నిరీక్షణ

- కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో 288 'డబుల్' ఇళ్లు పూర్తి
- లక్కీడ్రా ద్వారా అర్హుల ఎంపిక
- నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయని వైనం
- వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం

కాగజ్‌నగర్‌టౌన్: గూడు లేని నిరుపేదలకు నీడ కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రం ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో నివాసం ఉంటున్న పేదల కోసం చారిగాం రోడ్డు సమీపంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వంతో అన్ని సౌకర్యాలతో కూడిన ఇళ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. డబుల్ బెడ్రూంల నిర్మాణం పూర్తి కాగా, ఫినిషింగ్ వంటి చిన్న చిన్న పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. గత మార్చిలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న వార్డుల్లో అర్హులను ఆయా శాఖల అధికారులు లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. లబ్ధిదారులకు ఇప్పటివరకు ఇళ్లు కేటాయించలేదు. లబ్ధిదారులుగా ఎంపికైన వారు తమకు ఎప్పుడు ఇళ్లు కేటాయిస్తారని ఆందోళన చెందుతున్నారు.

19 ఎకరాల్లో నిర్మాణం

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి కాగజ్‌నగర్ మండలం బోరిగాం శివారులోని సర్వే నంబర్ 139లో 19 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. 2018 ఆగస్టు 2న రాష్ట్ర మంత్రి కేటీఆర్ రూ.25.44 కోట్ల వ్యయంతో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. 20 బ్లాక్‌ల్లో జీ+2 పద్ధతిలో మొత్తం 480 డబుల్ బెడ్రూంలు నిర్మించాల్సి ఉండగా, 288 పూర్తి చేశారు. మిగిలిన 192 ఇళ్లు స్థల వివాదం కారణంగా పునాదుల దశకే పరిమితమయ్యాయి. పూర్తయిన ఇళ్లకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని 30 వార్డుల నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 30 వార్డుల నుంచి 5,372 మంది ఇళ్లు లేని పేదలు దరఖాస్తు చేసుకున్నారు. మార్చి 10న వార్డుకు తొమ్మిది మంది చొప్పున 270 మందిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. మిగిలిన 18 ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక జరగలేదు.



చారిగాం రోడ్డులో నిర్మించిన ఇళ్లు

కానరాని కనీస వసతులు

మరో వైపు 288 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కాగా అంతర్గత రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కనీసం విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించలేదు. చాలా వరకు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. డబుల్ బెడ్రూం కాలనీలో ఏ ఒక్క బ్లాక్‌లో కూడా ప్రజలు లేకపోవడంతో ఆ ప్రాంతం వెలవెలబోతోంది. అంతే కాకుండా సామగ్రి సైతం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. అర్హులుగా ఎంపికైన తమకు వెంటనే డబుల్ బెడ్రూంలు కేటాయించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్లు లేక తాము అద్దె ఇళ్లలో ఉండి ఆర్థికంగా నష్టపోతున్నామని, త్వరితగతిన అధికారులు పనులు పూర్తిచేసి కేటాయింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వసతులు కల్పిస్తాం

చారిగాం రోడ్డులో పూర్తయిన 288 డబుల్ బెడ్రూం ఇళ్లలో అన్ని వసతులు కల్పిస్తాం. పూర్తయిన వాటిలో అన్ని సదుపాయాలు కల్పించేందుకు పనులు ముమ్మరం చేశాం. మురుగుకాలువలు, అంతర్గత రోడ్లు తదితర వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.
– లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ

ఆందోళన వద్దు

రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహిస్తాం. లక్కీడ్రా ద్వారా ఎంపికైన అర్హుల జాబితాను గతంలోనే విడుదల చేశాం. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు.
– శ్రీపాల్‌రెడ్డి, తహసీల్దార్, కాగజ్‌నగర్

నవోదయ విద్యార్థుల శ్రమదానం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఫాతిమా కాన్వెంట్ పాఠశాల సమీపంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రణీల్ తదితరులు ఉన్నారు.



శ్రమదానం చేస్తున్న నవోదయ విద్యార్థులు

క్లుప్తంగా

లారీ ఢీకొని బాలుడు మృతి


సూర్యవర్ధన్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి లారీ ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పట్టణంలోని శ్రీశ్రీనగర్‌కు చెందిన ఎరుకల మధు, రజిత దంపతుల రెండో కుమారుడు సూర్యవర్ధన్ (13) శనివారం రాత్రి బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం ముందు రోడ్డు దాటి దుకాణంలో తినుబండారాలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా సెంట్రల్ డివైడర్ దాటుతున్న క్రమంలో మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వంటింట్లో గ్యాస్ లీక్

నెన్నెల: వంటింట్లో అకస్మాత్తుగా గ్యాస్ లీకైన ఘటనలో కుటుంబ సభ్యులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. మండల కేంద్రంలోని కొండువాడలో ఆదివారం కొండు నవీన్ ఇంట్లో వంట చేయడానికి గ్యాస్‌స్టవ్ వెలిగించగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో కుటుంబ సభ్యులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు గోధుమపిండి చల్లి బెడ్‌షీట్ కప్పడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో వంటసామగ్రితో పాటు సరుకులు కాలిపోయాయని బాధితుడు నవీన్ తెలిపారు.

కలప పట్టివేత

నెన్నెల: కుశ్నపల్లి రేంజ్ పరిధిలోని నాగారం వద్ద ఆదివారం రాత్రి అక్రమంగా కలప తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు రేంజ్ అధికారి గోవింద్‌చంద్‌సర్దార్ తెలిపారు. వాహనంలో 46 టేకు దిమ్మలు లభ్యమయ్యాయని, వాటి విలువ రూ.1.75లక్షలు ఉంటుందన్నారు. స్మగ్లర్లు వాహనాన్ని వదిలేసి పారిపోయారని, పంచనామా నిర్వహించి వాహనాన్ని రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శ్రీరాంపూర్: వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సూచించారు. నస్పూర్ పీహెచ్‌సీలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్తాచెదారం తొలగించారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాలను, వారు పనిచేసే కార్యాలయాలలో పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఇది అందరి బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, వైద్యులు నీరజ, అనిత సమత, అధికారులు వెంకటేశ్వర్, ప్రశాంతి పాల్గొన్నారు.

స్వచ్ఛత.. మన బాధ్యత..!


చెత్త తొలగిస్తున్న యోగేశ్‌పర్మార్

జైపూర్: స్వచ్ఛత అందరూ బాధ్యతగా స్వీకరించినప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్‌పర్మార్ అన్నారు. గృహంలో స్వచ్ఛత హీ సేవాహై దివాస్‌ను పురస్కరించుకుని జైపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ యోగేశ్‌పర్మార్, డిప్యూటీ కమాండెంట్ జీషన్ అమీర్, సహాయ కమాండెంట్ యక్షేందర్ పుండిర్‌తో కలిసి వసతి గృహం ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. పర్సనల్ మేనేజర్ శ్రీరామశాస్త్రి, సర్పంచ్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనానికి తీపికబురు

- నెరవేరనున్న యూనివర్సిటీ కల
- ములుగు జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ప్రధాని మోదీ ప్రకటన
- పోరాటం ఫలించిందంటున్న గిరిజన సంఘాల ప్రతినిధులు
- ఉమ్మడి జిల్లాకు అన్యాయమంటూ ఆవేదన

ఏళ్లుగా గిరిజనుల ఉన్నత విద్య కోసం యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు కోరుతున్నారు. ఎట్టకేలకు మహబూబ్‌నగర్ జిల్లాలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ములుగు జిల్లాలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని భారత ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ప్రకటించడం, ఈ యూనివర్సిటీకి ఆదివాసీ దేవతలైన సమ్మక్క – సారక్క పేరు పెడుతామని, రూ.900 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంపై ఆదివాసీ గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుపై ఉమ్మడి జిల్లాలోని పలువురు గిరిజన, ఆదివాసీల ప్రజాప్రతినిధులు, విద్యావంతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...


దర్బార్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు (ఫైల్)

ఆదిలాబాద్‌కు అన్యాయం...



ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయడం సంతోషకారంగా ఉంది. ఆదిలాబాద్‌లోని ఉట్నూర్‌లో మంజూరైన గిరిజన యూనివర్సిటీని ములుగులోకి తీసుకెళ్లి ఏర్పాటు చేయడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీలకు అన్యాయం జరిగింది. – కోట్నాక విజయ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

ములుగుకు మార్చడం బాధాకరం..



ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్‌లో 70శాతం ఆదివాసీలు ఉన్న జిల్లాలోని ఉట్నూర్‌కు మంజూరైన యూనివర్సిటీని ములుగుకు కేటాయించడం బాధాకరం. ఉమ్మడి జిల్లాలో ఒక్క యూనివర్సిటీ కూడా లేదు. ఉట్నూర్‌లో ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులకు న్యాయం జరిగేది. –కైలాస్, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు, ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కేటాయిస్తే బాగుండేది



నిర్మల్‌ఖిల్లా: ప్రధాని నరేంద్ర మోదీ ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నాం. ఈ గిరిజన యూనివర్సిటీని అత్యధిక గిరిజన, ఆదివాసీ జనాభా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, ఇచ్చోడ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే మరింత బాగుండేది. ఈ యూనివర్సిటీలో సంప్రదాయ కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే నూతన సాంకేతిక కోర్సులను ప్రవేశపెడితే గిరిజన విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. – రాజేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, నిర్మల్

ఓట్ల కోసమే యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటన



ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ అందుబాటులో లేక జిల్లాలోని చాలా మంది ఆదివాసీలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని గతంలో అనేక ఉద్యమాలు చేశాం. ప్రభుత్వం ఆలస్యంగా స్పందించింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆదివాసీల ఓట్లు రాబట్టుకోవడానికి ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేశారు. – దుర్వ నగేష్, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు

ఉమ్మడి జిల్లాలోనే ఏర్పాటు చేయాలి

కడెం: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటన సంతోషకరమైన విషయం. గిరిజనులు గత కొన్ని సంవత్సరాలుగా యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎదురుచూశారు. వారి చిరకాల కోరిక ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ అక్షరంలో ముందుంది. అక్షరాభ్యాసంలో కూడా ముందుకు రావాలంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే మంచిదని మా వాదన. – రాజేందర్ హపావత్, ఉమ్మడి జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి

యూనివర్సిటీ ఏర్పాటుపై జీవో విడుదల చేయాలి



ఖానాపూర్: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ చేసిన ప్రకటనలకే పరిమితం కాకుండా అధికారికంగా జీవో విడుదల చేయాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన ఉట్నూర్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. గతంలోనే యూనివర్సిటీకి కావాల్సిన స్థలాన్ని ఉట్నూర్‌లో సేకరించారు. – అజ్మీరా రేఖానాయక్, ఎమ్మెల్యే, ఖానాపూర్

కేంద్రానికి గిరిజనుల విద్యపై చిత్తశుద్ధి లేదు



ఆదిలాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసేది. ఎన్నికల్లో గిరిజనుల ఓట్లు దండుకునేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇది బూటకపు హామీ మాత్రమే. – కుద్రు రాజు, కుమురం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు

ఏళ్ల నాటి కల నెరవేరింది



పాతమంచిర్యాల: యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మోదీ ప్రకటించడం హర్షదాయకం. తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఏళ్లుగా ఎదురుచూశాం. ఎట్టకేలకు కల నెరవేరింది. గిరిజనులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లలేనివారికి ఇది మంచి అవకాశం. గిరిజన నిరుపేద విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశం. ఏళ్లనాటి కల నెరవేరింది. – ఎర్మ పున్నం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

విద్యావకాశాలు పుష్కలం



నిర్మల్‌ఖిల్లా: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రకటించడం హర్షణీయం.రూ 900 కోట్లతో ఏర్పాటు చేయబోయే యూనివర్సిటీతో గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలు మరింత మెరుగుపడతాయి.. రాష్ట్రంలోని గిరిజన ఆదివాసి బిడ్డలు ఉన్నత విద్య అందుబాటులోకి రానుంది. – భూక్య జానూబాయి, జెడ్పీటీసీ, పెంబి

ఆనందంగా ఉంది



నార్నూర్: ఏళ్లుగా యూనివర్శిటీ ఏర్పాటు కోసం ఆదివాసీ గిరిజనులు పోరాటం చేస్తున్నారు. పోరాటాన్ని గుర్తించిన ప్రధాని సమక్క సారక్క పేరుతో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయడం ఆనందంగా ఉంది. నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పడం ఆదివాసీ గిరిజనుల్లో మనోధైర్యాన్ని కలిగిస్తోంది. – మెస్రం గంగుబాయి సోము, జెడ్పీటీసీ, గాదిగూడ

భీం పురిటిగడ్డలో ఏర్పాటు చేస్తే బాగుండేది



నార్నూర్: ఆదివాసీ గిరిజనులు ఆరాధ్యుడు తెలంగాణలోనే వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేస్తే బాగుండేది. అయినప్పటికీ ఆదివాసీ గిరిజనుల పోరాటాన్ని అర్థం చేసుకుని ప్రధానమంత్రి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ప్రకటనను స్వాగతిస్తున్నాం. – దాదిరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

జిల్లా 'గిరి' విద్యార్థులకు తీరని అన్యాయం



ఉట్నూర్‌రూరల్: గిరిజన యూనివర్సిటీ ఇతర ప్రాంతానికి తరలించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న గిరిజన విద్యార్థులకు తీరని నష్టం. 15–20 ఏళ్ల నుంచి గిరిజన యూనివర్సిటీ కోసం పోరాడుతుంటే ఇతర జిల్లాలో ఏర్పాటు చేయడం సమంజసం కాదు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు మరింతగా అన్యాయం చేశారు. ఉన్నత చదువులకు స్థానికంగా వసతులు లేక ఇక్కడి విద్యార్థులు వెనుకబడి పోతున్నారు. – పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

పోరాటాల ఫలితమే..



కౌటాల: ఆదివాసీల సంఘాల ఎన్నో ఏళ్ల పోరాటల ఫలితామే గిరిజన యూనివర్సిటీ. ఉమ్మడి ఆదిలాబాద్‌లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాం. యూనివర్సిటీ ప్రకటించిన ప్రధానికి ప్రత్యేక కృతజ్ఞతలు. – మెర్పల్లి సదాశివ్, మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, కౌటాల

జిల్లా చేజారిన గిరిజన యూనివర్శిటీ

బోథ్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజనుల ఆశలు ఆవిరయ్యాయి. ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తారని అనుకున్న సమయంలో ప్రధాని మోదీ ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లాకు గిరిజన యూనివర్సిటీ చేజారింది. ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు ఉద్యమం చేశారు. దీంతో తెలంగాణకు గిరిజన యూనివర్శిటీ వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నా, ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయకపోవడంపై ఇక్కడి గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనువైన ప్రాంతంగా ఉన్న ఉట్నూర్‌లో గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై పెదవి విరుస్తున్నారు. గిరిజనులు అధికంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను విస్మరించడంపై ఇక్కడి గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఉట్నూర్‌లో ఏర్పాటుకు సన్నాహాలు

2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 2011లో ఆగస్టు 27న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు జీవో నంబరు 783 జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు, ఐటీడీఏ అధికారులు ఉట్నూర్‌లో 470తో పాటు మరో 300 ఎకరాల పోరంబోకు భూమిని గుర్తించారు. భూమితో పాటు సానుకూల అంశాలను పొందుపర్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించారు. దీంతో ఉట్నూర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోందని ఇక్కడి గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో తెలంగాణలో గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బిల్లులో పదకొండో అంశంలో ప్రస్తావించారు. అప్పటి నుంచి త్వరితగతిన గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు పలుమార్లు ఆందోళన సైతం నిర్వహించారు. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి చలనం కనిపించలేదు.

ములుగులో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ఆదేశాలు

ఈ క్రమంలో 2018లో అప్పటి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ములుగులో గిరిజన యూవర్శిటీని ఏర్పాటు చేసేందుకు అధికారులు భూమిని గుర్తించాలని ఆదేశించారు. గిరిజన యూనివర్శిటీకి అనువైన ప్రాంతంగా ఉన్న ఉట్నూర్‌లో కాకుండా ములుగులో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో ఇక్కడి ప్రజలు తీవ్రస్థాయిలో ఉద్యమాన్ని చేపట్టారు. ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయానికి భూమిని సైతం అప్పట్లోనే గుర్తించారు. కేంద్రానికి సైతం నివేదించారు. అప్పటి నుంచి ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశారు. అయినా ఫలితం లేదు. ప్రధాని మోదీ మహబూబ్‌నగర్ సభలో ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజనులు తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపినా, ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయకపోవడంపై నిరాశ చెందుతున్నారు.

'గుర్తింపు' ఎన్నికలు అడ్డుకుంటే కోర్టుకు వెళ్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను అడ్డుకుంటే కోర్టు ఆర్డర్ ఉల్లంఘన కింద హైకోర్టుకు వెళ్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెప్యూటీ సీఎల్సీ వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 30న ఓటర్ల జాబితాను విడుదల చేయాల్సి ఉన్నా అలా చేయకుండా ఎన్నికలు అడ్డుకునేందుకు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నాయన్నారు. ఇటీవల కార్మికులకు చెల్లించిన ఏరియర్స్‌లో 30 శాతం ఇన్‌కంట్యాక్స్ కింద, 19 శాతం సీఎంపీఎఫ్, పెన్షన్‌లకు సంబంధించిన డబ్బులు కట్ చేశారన్నారు. కోలిండియా మాదిరి ఇక్కడ కూడా పెర్క్స్‌పై ఐటీని కంపెనీ రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, కే.వీరభద్రయ్య, మల్లేశ్, రాంచందర్, ఆకుల లక్ష్మణ్, గునిగంటి నర్సింగరావు, మురళి చౌదరి, కారుకూరి నగేష్, అఫ్రోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్:మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, ఇందుకోసం వచ్చే ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహ కమిటీ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన చుంచు జగదీశ్, బత్తుల బాబూరావు అనుచరులు 150 మంది కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేశారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయినా, నియోజకవర్గంలో మాత్రం నిత్యం ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. కాలువల ద్వారా పంటలకు నీరు అందించేందుకు అవసరమైన పూర్తి ప్రణాళిక సిద్ధం చేశామని, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరుగులు తీయిస్తానని వివరించారు. సోనియా గాంధీ చెప్పినట్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ రామగిరి బానేశ్, యువజన కాంగ్రెస్ ఆల్ ఇండియా సెక్రటరీ శ్రావణ్‌రావు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సల్ల మహేశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, జోగుల సదానందం, స్వామి పాల్గొన్నారు.

యువతకు ప్రోత్సాహం అవసరం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణలోని యువకులకు ఎంతో ప్రతిభ ఉందని, అందుకు తగిన విధంగా గుర్తింపు, ప్రోత్సాహం అవసరమని రచయిత అల్లం రాజయ్య అన్నారు. ఆదివారం పాతమంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పైడిజయరాజ్‌తో సినిమాలు స్క్రీనింగ్, ఫిలిం అప్రిసియేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పల్లెల్లో అద్భుతమైన కంటెంట్ ఉందని, దీనిని సినిమా రూపంలో మలిస్తే అత్యంత ప్రజాదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాటల రచయిత చంద్రమౌళి, రుద్రనేత్రి దర్శకుడు కర్రె తిరుపతి, ఇంటింటి రామాయణం దర్శకుడు సురేష్, అప్పని శ్రీకాంత్, మానక్కని సిని మా రాజ్‌కుమార్, విల్సన్ సవిత, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదాతలు.. స్ఫూర్తిప్రదాతలు

మంచిర్యాలటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చే రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆదివారం రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారిని ఎమ్మెల్యే సత్కరించి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వి.మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్ గౌడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవో శ్రీమన్నారాయణ, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమణ, రెడ్‌క్రాస్ చైర్మన్ కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ మంచిర్యాల సంయుక్త ఆధ్వర్యంలో అత్యధికంగా రక్తదానం చేసిన వారిని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ పాల్గొన్నారు.

టీజీబీలో మరోసారి చోరీకి యత్నం

- కిటికీ గ్రిల్ తొలగించి లోనికి ప్రవేశించిన దొంగలు
- సైరన్ మోగడంతో పరార్


బ్యాంకు కిటికీ గ్రిల్‌ను తొలగించిన దుండగులు

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శనివారం రాత్రి మరోసారి చోరీకి విఫలయత్నం జరిగింది. నెల రోజుల క్రితం ఇదే బ్యాంకులో చోరీకి యత్నించిన ఘటన మరువక ముందే మళ్లీ దుండగుడు దొంగతనానికి యత్నించాడు. బ్యాంకు వెనుకాల ఉన్న కిటికీ గ్రిల్స్‌ను కట్టింగ్ ప్లేయర్, ఉలి సాయంతో తొలగించి లోనికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరా కనెక్షన్ తొలగించి స్ట్రాంగ్ రూమ్ డోర్‌ను గడ్డపారతో తెరిచేందుకు యత్నించగా సైరన్ మోగడంతో భయాందోళనకు గురై సిమ్ కార్డు లేని చిన్న సెల్‌ఫోన్, కట్టింగ్ ప్లేయర్, ఉలి, గడ్డపార, కర్చీఫ్ అక్కడే వదిలి పారిపోయాడు. సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉండడంతో సైరన్ మోగిన శబ్దం విన్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగ అక్కడి నుంచి పరారయ్యాడని బ్యాంకులో నగదు, బంగారం చోరీకి గురికాలేదని ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. నెల రోజుల క్రితం ఇదే బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేసి గుడ్ బ్యాంకు ఒక్క రూపాయి కూడా దొరకలేదని కితాబ్ ఇచ్చిన దొంగే మళ్లీ చోరీకి యత్నించినట్లు పోలీసులు, బ్యాంకు సిబ్బంది భావిస్తున్నారు. ఆదివారం పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌లో 1978 నుంచి 2023 వరకు పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 300లకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు పాదాభివందనం చేశారు. పాఠశాల ప్రాంగణమంతా కలియ తిరిగి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం 1997–98 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత తిరిగి పాఠశాలలో కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు పూదరి సత్యనారాయణ, పూర్వ ఉపాధ్యాయులు నగేష్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు , విజయ, బబిత, తివారి, పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మందమర్రిరూరల్: 1991-92 బ్యాచ్ విద్యార్థులు


బెల్లంపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు